కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :155 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | బుధవారం 07-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

ముస్లింల ఓట్లను టార్గెట్ చేసి తొలగించే కుట్రలు చేస్తున్నారు



హైదరాబాద్, అక్టోబరు 6 : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఫామ్ -7పై ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన ఆరోపణలు చేశారు. ముస్లింల ఓట్లను టార్గెట్ చేసి తొలగించే కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈరోజు (మంగళవారం) హైదరాబాద్‌లో మీడియాతో అసదుద్దీన్ మాట్లాడారు. గోషామహల్ నియోజకవర్గంలో ప్రి - ప్రింటెడ్ ఫామ్స్ లభించాయని తెలిపారు. గోషామహల్‌లో ప్రి - ప్రింటెడ్ ఫామ్ -7 ఫామ్స్ ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. గోషామహల్‌లో బూత్ నంబర్- 28, 30, 127లో ముస్లిం ఓటర్లే టార్గెట్‌గా ఫామ్ -7లు ఎందుకు సమర్పిస్తున్నారని నిలదీశారు.

వారిపై కేసులు నమోదు చేయాలి..

ఓ వ్యక్తి 122 ఫామ్స్ ఎలా సమర్పించారని అసదుద్దీన్ ఓవైసీ ప్రశ్నల వర్షం కురిపించారు. అసలు ఆ వ్యక్తి ఎవరు అన్ని ఫామ్స్ ఎలా సమర్పించారని నిలదీశారు. బల్క్‌గా ఫామ్ -7 ఇచ్చిన వాళ్లపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో అసలు ఏం జరుగుతోందో అర్థం కావడం లేదని అన్నారు. వెస్ట్ బెంగాల్‌లో ఏం జరిగిందో తమకు తెలీదని చెప్పారు. హైదరాబాద్‌లో తాము ప్రత్యక్షంగా చూస్తున్నామని తెలిపారు. బీజేపీ నాయకులే ముస్లింల ఓట్ల గురించి ఫామ్ -7 ఇస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీఈసీకి స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉంటే బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు.

పాత పద్ధతి ప్రకారమే సీఈసీ సెలక్షన్ ఉండాలి..

తమాషా ఎందుకు చేస్తున్నారని.. ప్రజలను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని అసదుద్దీన్ ఓవైసీ ప్రశ్నించారు. సీఈసీ సెలక్షన్ చేసే పద్ధతి సరిగా లేదని ఫైర్ అయ్యారు. సీఈసీ సెలక్షన్ PM - LOP - CJ సమక్షంలో జరగాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతి ప్రకారమే సీఈసీ సెలక్షన్ ఉండాలని పట్టుబట్టారు. 2002లో ఓ వ్యక్తికి ఓటు హక్కు ఉందని.. కానీ ఇప్పుడు 'సర్' ప్రక్రియలో పేరు ఎందుకు రావట్లేదని నిలదీశారు. అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ 'సర్'లో పేరు ఎందుకు ఉండట్లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఈసీ ఎన్నిక పద్ధతిలో బీజేపీ తీసుకువచ్చిన చట్టం మార్చాలని అసదుద్దీన్ ఓవైసీ డిమాండ్ చేశారు.

'సర్' ప్రక్రియపై విపక్షాల ప్రచారం అవాస్తవం



హైదరాబాద్, అక్టోబర్ 6: బీజేపీ, ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతలు ప్రజల్లో తప్పుడు సమాచారాన్ని, అపోహలను వ్యాప్తి చేస్తున్నారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. ఫారమ్-6, ఫారమ్-7లను ఏదో భూతంలా చూపిస్తూ ఓట్లు తొలగిస్తున్నారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఫారమ్-6 అనేది ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ప్రక్రియ మాత్రమే అని.. దీనిపై రాహుల్ గాంధీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫారమ్-6, ఫారమ్-7 అంశాలపై ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టమైన, వివరణాత్మక ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా కీలక నిర్ణయాలు తీసుకున్నారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని టీబీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. 2025 జూన్ 24న బిహార్‌లో చేపట్టిన SIR ప్రక్రియ ఎన్నికల సంఘం ఏకగ్రీవ నిర్ణయంతోనే జరిగిందన్నారు. SIRపై ఎన్నికల సంఘం తీసుకున్న ఏకగ్రీవ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని తెలిపారు. ఎన్నికల సంఘంలో ముగ్గురు కలిసి నిర్ణయం తీసుకోలేదనడం రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారం మాత్రమే అని వెల్లడించారు. 2.8 కోట్ల మంది మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారని కాంగ్రెస్ నేతలు అంటున్నారని.. మరి చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలా? వద్దా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్, సోనియా ఓటు చోరీతోనే ఎంపీలుగా గెలిచారా అని ప్రశ్నించారు. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లో ఓటు చోరీతోనే కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందా అని నిలదీశారు. 1952 నుంచి 2014 వరకు దేశంలో 12 సార్లు SIR జరిగిందని.. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయని రాంచందర్ రావు అన్నారు. SIR తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాలన్నీ అక్రమ ప్రభుత్వాలేనని కాంగ్రెస్ ఇప్పుడు చెప్పగలదా అని అడిగారు. కాంగ్రెస్ గెలిస్తే ఎన్నికల సంఘం మంచిదంటుందని.. ఓడిపోతే ఎన్నికల సంఘం, ఈవీఎంలపై ఆరోపణలు చేస్తుందని.. ఇదీ కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అంటూ ఫైర్ అయ్యారు. ఈవీఎంలను ప్రవేశపెట్టింది కూడా రాజీవ్ గాంధీ ప్రభుత్వమే అని.. మరి రాహుల్ ఇప్పుడు తన తండ్రి తీసుకొచ్చిన విధానాన్నే తప్పుపడుతున్నారా అని ప్రశ్నించారు. 2018లో తెలంగాణలోనే అభిషేక్ మను సింఘ్వీ 70 లక్షల ఓటర్ల పేర్లలో అవకతవకలు ఉన్నాయని చెప్పారని బీజేపీ నేత గుర్తుచేశారు. 2018లోనే రాహుల్ గాంధీ ఫేక్, బోగస్, డూప్లికేట్ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారన్నారు. మధ్యప్రదేశ్‌లో 60 లక్షల ఫర్జీ ఓటర్లు ఉన్నారని కమల్‌నాథన్ గతంలో చెప్పారని, రాజస్థాన్‌లో 45 లక్షల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని సచిన్ పైలట్ చెప్పారని తెలిపారు. 2018లో కాంగ్రెస్ చెప్పిన ఫేక్, బోగస్, డూప్లికేట్ ఓట్లను తొలగించే బాధ్యత ఎన్నికల సంఘానిది కాదా? రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలన్నారు. అప్పుడు నకిలీ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఓటరు జాబితా శు

సీఈసీ రాజీనామా కోరుతూ ఇండియా బ్లాక్ ర్యాలీ..



న్యూఢిల్లీ,సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ప్రతిపక్ష ఇండియా బ్లాక్ కూటమి నేతలు ఢిల్లీలో మంగళవారం ర్యాలీ చేపట్టిన సంగతి తెలిసిందే. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం అయిన నిర్వచన్ సదన్ వరకు ఈ ర్యాలీ జరగాలి. ఇందుకోసం కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ వంటి అగ్రనేతలు పాల్గొన్నారు.ర్యాలీ కోసం నేతలు ఆకాశవాణి భవన్‌కు చేరుకున్నారు. అక్కడ్నుంచి పార్లమెంట్ సమీపంలోని మకర్ ద్వార్ నుంచి నేతలు ఈసీఐ కార్యాలయానికి వెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. భవనానికి చేరుకోకుండానే ఇండియా బ్లాక్ నేతల్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నేతలంతా నీతి అయోగ్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. రోడ్డుపైనే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ సహా కూటమి నేతలు ఈసీఐ, సీఈసీపై విమర్శలు చేశారు. ప్రభుత్వం ఓట్ చోరీకి పాల్పడిందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒక సమయంలో నేతలు బారికేడ్లు ఎక్కి ఈసీఐ కార్యాలయం వద్దకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. మరోవైపు ర్యాలీ సాగే మార్గాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి, ఆందోళనకారుల్ని అడ్డుకుంటున్నారు. ఈసీఐ భవనం వద్ద కూడా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్లమెంట్, ఆకాశవాణి భవన్, విజయ్ చౌక్ సహా అనేక ప్రాంతాల్లో భద్రత కొనసాగుతోంది.

మద్యం ధరలు పెంచితే తాగడం తక్కువ కాదు.. ఆదాయం పెరుగుతోంది



హైదరాబాద్, అక్టోబర్ 06: మద్యం ధరలు పెంచితే తాగడం తక్కువ కాదని.. ఆదాయం పెరుగుతుందని తెలంగాణ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కేసీఆర్ హయాంలో మద్యం విక్రయాల ద్వారా రూ.10 వేల నుంచి రూ.36 వేల కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు.ఆ పదేళ్లలో మద్యం విక్రయాల ద్వారా 265 శాతం ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం మద్యం విక్రయాల ద్వారా రూ.40 వేల కోట్లు ఆదాయం వస్తుందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4 వేల కోట్ల ఆదాయం మాత్రమే పెరిగిందని గణాంకాలతో సహా ఆయన వివరించారు.ఇక క్యూర్ అర్బన్ పరిధిలో 40 ఎక్స్‌ట్రా బార్లులు వచ్చాయని చెప్పారు. అయితే బార్ షాపుల వాళ్లకు కూడా కాంపిటీషన్ ఉంటుందన్నారు. మిగతా రాష్ట్రాల్లో వలే తెలంగాణలో కూడా ఈ కాంపిటేషన్ ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

లిక్కర్ ఉత్పత్తికి నీటి కొరత రాదు

ప్రివిలేజ్ ఫీజు వల్ల బార్‌లకు ఎలాంటి నష్టం లేదని.. కానీ తాగేవారిపై కొంత భారం పడుతుందని మంత్రి జూపల్లి అన్నారు. లిక్కర్ ఉత్పత్తికి నీటి కొరత రాదని స్పష్టం చేశారు. కృష్ణా వాటర్, డిండిపై సీఎం రేవంత్ రెడ్డితో సోమవారం సమీక్ష జరిగిందని గుర్తు చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఆయకట్టు పెంచుతూ పోయారని.. దానికి తగినట్లుగా వాటర్ సోర్స్ పెంచలేదని అన్నారు. ఏదుల రిజర్వాయర్ నుంచి కాకుండా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి తీసుకుంటే తెలంగాణకు ఉపయోగం ఉంటుందని సీఎం రేవంత్‌కు వివరించామని తెలిపారు. ఏదుల నుంచి నీరు తీసుకోవడం వల్ల ఎదురయ్యే ఇబ్బందుల గురించి చెప్పామన్నారు.అలాగే నల్లగొండకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అచ్చంపేట మీదుగా నీరు ఇవ్వాలని కోరామని చెప్పారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి వాటర్ విషయంలో సమగ్ర విచారణ చేయాలని ఈ సందర్భంగా అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి గుర్తు చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో 854 అడుగుల కంటే తక్కువ నీరు ఉంటే.. ఆ జాలాలను ఏపీ తీసుకెళ్లడానికి వీల్లేదని అప్పట్లో తాను స్టే తీసుకొచ్చానని వివరించారు. కర్ణాటక నుంచి వారం రోజులు తెలంగాణకు వాటర్ వచ్చాయని పేర్కొన్నారు. ఇంగ్లాండ్, లండన్‌లో కార్ వాషింగ్ చేయవద్దంటూ రూల్ పెట్టారని గుర్తు చేశారు. శ్రీశైలం నీటిని సాధ్యమైనంత మేరకు వాడుకుంటామని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు.

సిరిసిల్లకు మంత్రి పదవి కొత్తదా?.. రేవంత్‌పై కవిత తీవ్ర విమర్శలు



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 6: సిరిసిల్లకు మంత్రి పదవి కొత్తేమీ కాదని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల.. సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. గత పదేళ్లుగా ఇక్కడ మంత్రి ఉన్నారని అన్నారు. ఇప్పుడు మంత్రి పదవి ఇస్తామని చెప్పి మరోసారి ప్రజలను నమ్మించి ఓట్లు అడగడం ఎందుకని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. సిరిసిల్లకు నిధులు ఎందుకు కేటాయించడం లేదని నిలదీశారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి స్వయంగా నిధులు కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి రాజకీయాలు తప్ప మరే అంశంపై దృష్టి లేదని కవిత విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సిరిసిల్ల.. వేములవాడ ప్రాంతాల్లో ఒక్క ఎకరాకు కూడా నీరు రాలేదని ఆమె ఆరోపించారు.వేములవాడ ఆలయ అభివృద్ధిపై కూడా కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయ అభివృద్ధిని కాంక్రీట్ నిర్మాణాలతో కాకుండా కృష్ణా శిలతో చేపట్టాలని సూచించారు. ఆలయానికి ఉన్న చారిత్రక.. ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. నేరెళ్ల ఇసుక బాధితులకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల అభివృద్ధి, సాగునీటి సమస్యలు, నేరెళ్ల బాధితుల అంశాలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కవిత కోరారు.



సంపాదకీయం

బుధవారం 07-10-2026

వేగంగా తగ్గిపోతున్న యువ జనాభా

ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశంగా పేరుగాంచిన భారత్‌లో ఇప్పుడు జననాల రేటు భారీగా తగ్గిపోవడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకప్పుడు వేగంగా పెరిగిన జనాభా ఇప్పుడు క్రమంగా క్షీణించడం వైపు అడుగులు వేస్తోంది. తాజా నివేదికల ప్రకారం దేశంలో జననాలు గణనీయంగా పడిపోగా, సంతానోత్పత్తి రేటు కూడా 1.9కి పడిపోయింది. రాబోయే రోజుల్లో యూరప్, తూర్పు ఆసియా దేశాల మాదిరిగా భారత్ కూడా వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొనే దిశగా మారుతుందా అనే దానిపై ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది జనాభా పెరుగుదల నుంచి క్షీణత వైపు మలుపు: దశాబ్దాల పాటు జనాభా విస్ఫోటనం గురించి చర్చించుకున్న మన దేశం, ఇప్పుడు సరిగ్గా వ్యతిరేకమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. 2023 నాటికి దేశంలో జననాల సంఖ్య ఏకంగా 1974 నాటి స్థాయికి పడిపోవడం గమనార్హం. జనాభా స్థిరత్వానికి లేదా వృద్ధికి కనీసం 2.1 సంతానోత్పత్తి రేటు అవసరం కాగా, ప్రస్తుతం అది 1.9కి చేరింది. ఈ గణాంకాలు భవిష్యత్తులో దేశ జనాభా స్వరూపంలో రాబోతున్న పెను మార్పులకు స్పష్టమైన సంకేతాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచ దేశాలన్నింటికీ మన దేశమే అతిపెద్ద శ్రామిక శక్తిని అందిస్తుందని గర్వంగా చెప్పుకునేవాళ్లం. కానీ, సంతానోత్పత్తి రేటు ఇలాగే పడిపోతూ వస్తే, రాబోయే కొన్ని దశాబ్దాల్లో మనకు యువ ఉద్యోగుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఒకప్పుడు దేశ అభివృద్ధికి ప్రధాన బలముగా మారిన 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' క్రమంగా ముగింపు దశకు చేరుకుని, వృద్ధుల సంఖ్య పెరిగే 'డెమోగ్రాఫిక్ ట్రాన్సిషన్' వైపు భారత్ వేగంగా పయనిస్తోంది. స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకోవాలనుకుంటారు కొంత మంది. స్థిరపడేసరికి వయసయిపోతుంది. ఇలాంటి సమస్య దేశానికి వస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు భారత్ అలాంటి పరిస్థితులోకి వెళ్తోంది. దేశం ఇప్పటికి అభివృద్ధి చెందుతున్న దేశమే. 2047కి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని టార్గెట్ పెట్టుకున్నారు. అప్పటికి ఆ లక్ష్యం సాధించినా దేశం మాత్రం వృద్ధాప్యంలోకి వెళ్లబోతోంది.దక్షిణాదికి చెందిన ముఖ్యమంత్రులు, ముఖ్య నాయకులు ఎక్కువ మంది పిల్లల్ని కనండి.. జనాభాను పెంచండి అని చేసిన ప్రకటనలను చూసి సోషల్ మీడియాలో, సాధారణ చర్చల్లో చాలా మంది తేలిగ్గా నవ్వుకున్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వేధిస్తున్న ప్రస్తుత కాలంలో మళ్లీ పిల్లల్ని కనమని చెప్పడమేమిటంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కానీ, ఆ నాయకుల మాటల్లో కేవలం రాజకీయ స్వార్థం మాత్రమే కాదు.. భవిష్యత్ భారతదేశాన్ని ముంచెత్తబోతున్న ఒక పెను జనాభా సంక్షోభం తాలూకు ఆందోళన కూడా దాగి ఉందన్న కఠిన వాస్తవాన్ని ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ మూడీస్ తాజా నివేదిక కళ్లకు కట్టింది.భారత్‌లో సంతానోత్పత్తి రేటు ఇప్పటికే స్థిరీకరణ స్థాయిగా భావించే రీప్లేస్‌మెంట్ లెవల్ 2.1 కంటే కిందకు పడిపోయింది. 2024 నాటికే మన దేశంలో 65 ఏళ్లు పైబడిన వారి శాతం 7 దాటి, భారత్ అధికారికంగా ఏజింగ్ దశలోకి అడుగుపెట్టింది. 2049 నాటికి ఈ వాటా 14 శాతానికి పెరిగి ఏజ్డ్ సమాజంగా, ఆ తర్వాత కేవలం 16 ఏళ్ల వ్యవధిలోనే అంటే 2065 నాటికి 21 శాతానికి చేరి సూపర్ ఏజ్డ్ దేశంగా భారత్ మారబోతోంది. అమెరికా వంటి అగ్రరాజ్యానికి ఏజ్డ్ నుంచి సూపర్ ఏజ్డ్ కావడానికి 19 ఏళ్లు, ఇండోనేసియాకు 29 ఏళ్లు పడితే.. భారత్ అత్యంత వేగంగా ఆ విషవలయంలోకి చేరిపోతుంది.ఇక్కడ అసలైన ప్రమాదం వృద్ధుల సంఖ్య పెరగడం ఒక్కటే కాదు. మనం ఎంత సంపన్నమైన తర్వాత వృద్ధులవుతున్నామన్నదే అసలు సమస్య. జపాన్, యూరప్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు ముందుగా పారిశ్రామికంగా ఎదిగి, ఆర్థికంగా పరిపుష్టమై, పూర్తిస్థాయిలో ధనిక దేశాలు గా మారిన తర్వాతే వృద్ధాప్య సమాజాలుగా మారాయి. కానీ భారత్ వంటి వర్ధమాన దేశాలు ఇంకా తలసరి ఆదాయంలో అట్టడుగున ఉన్న తరుణంలోనే వృద్ధాప్యంలోకి జారుకుంటున్నాయి. అంటే, ధనిక దేశం కాకముందే వృద్ధ దేశంగా మారే ప్రమాదం మన ముంగిట ఉంది. అత్యంత తక్కువ ఆదాయం ఉన్న దశలోనే కోట్లాది మంది వృద్ధులకు ఉచిత వైద్యం, పెన్షన్లు, దీర్ఘకాలిక సంరక్షణ భారాన్ని ప్రభుత్వాలు మోయాల్సి రావడం దేశ ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేసే అంశం.పనిచేసే చేతులు తగ్గడం వల్ల ఉత్పాదకత తగ్గి, పన్నులు కట్టే యువతరం క్షీణిస్తే దేశ అభివృద్ధి చక్రం ఆగిపోతుంది. వినియోగదారులు తగ్గితే మార్కెట్ డిమాండ్ పడిపోయి పరిశ్రమలు నష్టపోతాయి. కేరళ కంటే ప్రస్తుతం చాలా రాష్ట్రాలు తక్కువ సంతానోత్పత్తి రేటును కలిగి ఉన్నప్పటికీ, అక్కడ సుదీర్ఘ కాలంగా సంతానోత్పత్తి రేటు తక్కువగా నమోదవుతోంది... 25 ఏళ్లలోపు జనాభా 37.4% జనాభాలో మూడవ వంతు ఉన్నారు. కేరళలో సంతానోత్పత్తి రేటు 1991 నాటికి 1.8కి పడిపోయింది. ప్రస్తుతం కేరళ (1.7 శాతం) కంటే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లో సంతానోత్పత్తి రేటు 1.6 శాతంగా ఉంది. 1991 నాటికి ఈ రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు 3 కన్నా ఎక్కువ ఉండగా.. తమిళనాడులో మాత్రమే 2.2 శాతంగా ఉంది. తత్ఫలితంగా కేరళ కంటే 25 ఏళ్లలోపు జనాభా ఎక్కువ ఉంది.పట్టణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి తక్కువగా ఉన్నందున, 25 ఏళ్లలోపు వారి సంఖ్య గ్రామీణ ప్రాంతాల కంటే తక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాలకు వలసలు కూడా ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మహిళల్లో ఎక్కువ ఆయుఃప్రమాణం.. దశాబ్దాలుగా లింగ నిష్పత్తులు క్షీణించడం వల్ల మహిళల్లో 25 ఏళ్లలోపు వారి నిష్పత్తి పురుషుల కంటే తక్కువగా ఉంటుంది. జాతీయంగా 47.4 శాతం ఉన్న పురుష జనాభాతో పోలిస్తే 25 ఏళ్ల కంటే తక్కువ వయస్సు మహిళల శాతం 46.3 శాతంగా ఉంది.దేశానికి లభించిన అతిపెద్ద వరం డెమోగ్రాఫిక్ డివిడెండ్ . ఈ కాలం ముగిసిపోవడానికి మనకు మిగిలి ఉన్న సమయం చాలా తక్కువ. ఈ ముప్పును గుర్తించి హెచ్చరిస్తున్న నాయకులను ఎగతాళి చేస్తూ కాలం గడిపితే.. యువ భారతం అతి త్వరలోనే భరించలేని ఆర్థిక భారంతో కుంగిపోయే వృద్ధ భారతం గా మిగిలిపోవడం తథ్యం.

"స్వచ్ఛ ఆటో"ను కాపాడుకుందాం..



హైదరాబాద్,మన నగరాలలో నగరం విస్తృతిని బట్టి కొన్ని లక్షల సంఖ్య లో కార్మికులు మన గృహాలలోంచి వచ్చే చెత్త, రోడ్లపై ఉండే చెత్త, ఆఫీసుల్లో, కార్మాగారాలలో, హోటళ్లలో, రకరకాల దినసరి కార్యక్రమాల్లోంచి వచ్చే చెత్తను శుభ్ర పరుస్తుంటారు. రోడ్లపై పేరుకుపోయే దుమ్ము, ధూళినే కాకుండా అక్కడక్కడ పడి ఉన్న పిల్లి, ఎలుక, కుక్కలలాంటి జంతువుల కళేబరాలను తీసివేస్తుంటారు. ఎప్పుడైనా మన ఇంట్లోనుండి చెత్త తీసుకోకపోయినా, రోడ్లపై చెత్తచెదారం కనిపించినా, క్షేత్రస్థాయిలో చెత్తను తీసుకెళ్ళే కార్మికులపై ఆగ్రహం ప్రదర్శిస్తుంటాం. అప్పుడప్పుడు దాడులకు కూడా పాల్పడడం జరుగుతుంది. ఈ కార్మికులు చేసే ఈ పనిని అసహ్యించు కుంటాం. చెత్త అబ్బాయి, చెత్త ఆయన, చెత్త ఆమె అని చాలా అగౌరవంగా సంబోధిస్తుంటాం. కాని ఆ చెత్త శుభ్ర పరిచే వ్యవస్థ పనిచేసే తీరు ఏంటి, అందులో ప్రభుత్వం, మున్సిపాలిటీల పాత్ర ఎంత, కార్మికుల పాత్ర ఎంత అన్న విషయాలు మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది.జంట నగరాలతోపాటు ఈ నగరాల చుట్టూ కొత్తగా విస్తరించిన ప్రాంతాలు, ఆధునిక కాలనీలలో చెత్త శుభ్రం చేసే వ్యవస్థ అమలులో ఉంది. ఇండ్లలోని చెత్తను, బస్తీలు, కాలనీలు, రోడ్లపై ఉండే చెత్తను ప్రతిరోజూ పొగుచేసి దాన్ని మున్సిపాలిటి నిర్దేశించిన స్థలాలో వేస్తారు. అక్కడ నుండి జిహెచ్ఎమ్సి లేక ప్రయివేటు కాంట్రాక్టర్ వాహనాల ద్వారా ఆ చెత్తను ప్రధాన డంపింగ్ ప్రదేశమైన జవహర్‌నగర్‌కు తరలిస్తారు. నగరంలో రోజూ రోడ్లు శుభ్రం చేసే పనిలో దాదాపు 20వేల మంది కార్మికులు పని చేస్తూ ఉంటారు. ఇందులో కేవలం, రెండువేల మంది మాత్రమే మున్సిపాలిటీ ద్వారా నియమింపబడి, ప్రభుత్వ నియమాల ప్రకారం జీతభత్యాలు పొందుతారు. తక్కిన వారంతా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు. వీళ్ళంతా ఒక దజను మంది కాంట్రాక్టర్ల అజమాయిషీలో పని చేస్తుంటారు. వీళ్ళే కాక, గృహాల నుండి ప్రతి రోజూ ఇంటింటికీ తిరిగి చెత్త తీసుకెళ్ళి డంపింగ్ ప్రదేశాలకు తరలించే కార్మికుల వ్యవస్థ కూడా ఒకటి ఉంది. వీళ్ళు ఎవరి అజమాయిషీలో పని చేయరు.30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం మూడు చక్రాల డబ్బా రిక్షాలు సరఫరా చేస్తే వాటిలో ఈ కార్మికులు గృహాలలోంచి చెత్తను తీసుకెళ్ళేవారు. ఇందులో కూడా కొందరు మున్సిపల్ ఉద్యోగులు, కొందరు ప్రైవేటు, ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేసేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడు చక్రాల బండిలో చెత్త తరలించే కార్మికులకు సబ్సిడీ ఇచ్చి స్వచ్ఛ ఆటోలు, టిప్పర్లు ప్రభుత్వం అందచేసింది. దాదాపు 5000 డీజిల్‌తో నడిచే వాహనాలను దళిత, వెనుక బడ్డ కులాలకు ప్రభుత్వం సబ్సిడీ కింద, బ్యాంకుల నుండి రుణ సౌకర్యం కల్పించింది. సబ్సిడీ పోను మిగతా డబ్బు ఈ కార్మికులు, వాళ్ళు సేవలు అందిస్తున్న గృహ యజమానుల దగ్గరి నుండి తీసుకొనే డబ్బులోంచి, చెల్లించి ఆ వాహనాలకు సొంతదార్లు అయ్యారు. సరిగ్గా ఇదే సమయంలో రాంకీ ఎన్విరాన్ ఇంజినీరింగ్ లిమిటెడ్ అనే ప్రైవేటు సంస్థ వివిధ డంపింగ్ యార్డుల్లో పడేస్తున్న చెత్తను, డంపింగ్ కేంద్రం అయిన జవహర్‌నగర్‌కు తరలించేది. ఆ డంపింగ్ యార్డు నిర్వహణ విషయంలో 2009వ సంవత్సరంలో ప్రభుత్వం రాంకీ సంస్థ తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది.తరవాత 2018 లో, 2022 లో రెండు పర్యాయాలు, ప్రభుత్వం రాంకీ సంస్థతో ఒప్పందం పునరుద్ధరణ (రెన్యూవల్) చేసుకున్న సందర్భాలలో ఈ సంస్థ ప్రభుత్వం నుండి చాలా రాయితీలు రాబట్టుకుంది. రాంకీ సంస్థ చెత్తనుండి తయారు చేసే విద్యుచ్ఛక్తిని, కంపోస్టు ఎరువును ఆ సంస్థనే అమ్ముకోవడానికి ప్రభుత్వం ఒప్పుకుంది. డంపింగ్ యార్డు స్థలం ప్రభుత్వమే తన ఆధీనంలో ఉన్న భూమిని సంస్థకు కేటాయిస్తానని ఒప్పుకుంది. ప్రస్తుతం జవహర్‌నగర్ ప్రధాన డంపింగ్ యార్డ్ కాకుండా, మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లాలో ఫతుల్లగూడ, కూకట్‌పల్లి మండలంలో, శంషగూడ, రంగారెడ్డి, గండిపేట మండలంలోని గంధంగూడలో ప్రభుత్వం కేటాయించిన భూముల్లో, రాంఖీ సంస్థ చెత్త నిర్వహణ కార్యక్రమంలో ఉంది. రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్ వల్ల దాని చుట్టూ మూడు కిలోమీటర్ల పరిధిలో భూగర్భ జలాలు కలుషితమయ్యామని, వాయు కాలుష్యంతో భయంకరమైన దుర్గంధం వ్యాప్తిచెందడంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారని గత సంవత్సర కాలంగా ఆ డంపింగ్ యార్డును మూసివేయాలని పెద్ద ఆందోళన జరుగుతుంది. దాని నిర్వహణ బాధ్యత ప్రైవేట ఏజెన్సీ రాంఖీ ఇంజినీర్స్ తీసుకున్న తర్వాతనే పరిస్థితులు ఇట్లా దిగజారాయని ప్రజలు అంటున్నారు.ప్రతి రోజూ దాదాపు 6,000 టన్నుల చెత్త నగరం, దాని చుట్టు పక్కల నివాసాల నుండి వెలువడుతుందని నివేదికలు తెలుపుతున్నాయి. 4,000 టన్నుల ఆహారం, తినుబండారాలకు సంబంధించిన మిగులు చెత్త, హోటళ్లు, రెస్టారెంట్లు, రోడ్లపై స్నాక్స్ అమ్మే టిఫిన్ సెంటర్లు, టిఫన్ బండ్ల నుండి వెలువడుతుంది. గతంలో ఈ ఆహారానికి సంబంధించిన చెత్తను స్వచ్ఛ ఆటో, టిప్పర్ కార్మికులే సేకరించేవారు. కానీ సంవత్సర కాలంగా రాంఖీ లారీలు ఈ ఆహారపు మిగులును తరలిస్తున్నాయి. ఈ ఆహారపు మిగులు పందులకు ఆహారంగాను, కంపోస్ట్ ఎరువుల తయారీలోనూ వాడుతారు. దీన్ని అమ్మడం ద్వారా వచ్చే ఆదాయం రాంఖీ సంస్థ ఖాతాలోకే పోతుంది.గతంలో ఈ డబ్బులు కార్మికులు తీసుకునేవారు. ఇళ్ళలోంచి సేకరించే చెత్తలో లభించే ప్లాస్టిక్, ఇనుము, రాగి, ఇతర లోహాలు, పనికిరాని వస్తు సామగ్రిని, స్వచ్ఛ ఆటో కార్మికులు స్క్రాప్ వ్యాపారస్థులకు అమ్ముకొని కొంత ఆదాయం సంపాదించుకుంటారు. ఒక స్వచ్ఛ ఆటో, టిప్పర్‌పై డ్రైవర్‌తో సహా ఇద్దరు కార్మికులు పని చేస్తారు. ఈ సంవత్సరం జనవరి మాసంలో కేంద్ర ప్రభుత్వం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు, మార్గదర్శకాలు తయారు చేసి చాలా వివరాలతో కూడిన డాక్యుమెంట్‌ను అన్ని రాష్ట్రాలకు పంపి, 36 నెలల్లో ఆ డాక్యుమెంట్‌లోని అంశాలను అమలు పర్చాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ 80 పేజీల పత్రంలో రకరకాల వ్యర్థ పదార్థాలను శాస్త్రీయంగా ఎట్లా వేరు చేయాలి, రసాయన పదార్థాలు, హాస్పిటళ్ల నుండి వచ్చే మానవ శరీర భాగాలను, ఫ్యాక్టరీల నుండి వచ్చే రసాయన పదార్థాలు వగైరా ఎట్లా సేకరించాలి, ఏ పద్ధతిలో యార్డులో విసర్జించాలి అన్న విషయాలు వివరంగా ఉన్నాయి.కానీ, వివిధ వ్యవస్థల్లో సేకరించిన చెత్తను ఎట్లా రవాణా చేయాలి అన్న అంశానికి సంబంధించిన నియమాలు కానీ, వివరణలు కానీ లేవు. తెలం గాణ పభుత్వం, కేంద్రం నిర్దేశించిన మార్గదర్శకాల నెపంతో చెత్త తరలింపు వ్యవస్థను రాంఖీ ఎన్విరో ఇంజినీర్ ప్రైవేటు సంస్థకు అప్పచెప్పాలనే ఆలోచన చేస్తున్నది.

ఎల్ నినో ఎఫెక్ట్... కొత్త జాబ్ కార్డు రెడీ

హైదరాబాద్, ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి 15 రోజుల్లోనే కార్డులు అందించాలని ఆదేశించింది. ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. పంటల సాగు తగ్గడంతో కూలీలకు పనులు, ఆదాయం తగ్గిన నేపథ్యంలో ప్రతి గ్రామంలో రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి జాబ్‌కార్డులు త్వరగా జారీ చేయాలని నిర్ణయించింది. కొత్త దరఖాస్తుదారులకు 15 రోజుల్లోనే జాబ్‌కార్డు అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటల సాగు తగ్గింది. దీంతో వ్యవసాయ పనులపై ఆధారపడే కూలీలకు పనిదినాలు తగ్గి ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రస్తుత జాబ్‌కార్డుదారులతో పాటు కొత్తగా ఉపాధి కోరుకునే వారిని కూడా నమోదు చేయాలని సూచించింది. గ్రామాల్లో ఉపాధి అవసరమున్న కుటుంబాలను గుర్తించి వారికి పనులు కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రతి గ్రామం నుంచి రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. వ్యవసాయ పనులు తగ్గిన సమయంలో గ్రామీణ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఉపాధి హామీ పనులు అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. ముఖ్యంగా కరవు ప్రభావిత మండలాల్లో ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 52.46 లక్షల కుటుంబాలకు చెందిన 1.08 కోట్ల మంది జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. వీరికి కొనసాగుతున్న ఉపాధి అవకాశాలతో పాటు కొత్తగా పనులు కోరుకునే కుటుంబాలను కూడా పథకంలోకి తీసుకురావడం ద్వారా కరవు పరిస్థితుల్లో ఆదాయ నష్టాన్ని కొంతమేర తగ్గించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. 18 ఏళ్లు నిండిన గ్రామీణులు జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఆధార్‌కార్డు, ఫొటోను జత చేయాలి. సంబంధిత పత్రాలతో దరఖాస్తును గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలి. కార్యదర్శి దరఖాస్తును పరిశీలించిన అనంతరం మండల కార్యాలయానికి పంపిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో దరఖాస్తు, సంబంధిత పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారిస్తారు. అనంతరం జాబ్‌కార్డు జారీ చేస్తారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ఈ ప్రక్రియను వేగవంతం చేసి 15 రోజుల్లోనే కార్డు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయ పనులు తగ్గినప్పటికీ గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా చేయడం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కరవు ప్రభావిత ప్రాంతాల్లో స్థానికంగా పనులు కల్పించడం ద్వారా కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే అవసరాన్ని తగ్గించే అవకాశం ఉంది.

బీసీ రిజర్వేషన్లు...ఓటు బ్యాంక్ డ్రామాలు

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సర్వోన్నత న్యాయస్థానం నిబంధనలకు ఈ జీవోలు విరుద్ధమని స్పష్టం చేస్తూ, ఆరు వారాల్లో ప్రక్రియ ప్రారంభించి ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తామని సీఎం చంద్రబాబు ప్రకటించినప్పటికీ, న్యాయపరంగా ఇది నిలబడదని తెలిసి కూడా వేస్తున్న రాజకీయ ఎత్తుగడగానే స్పష్టమవుతోంది.రాజ్యాంగబద్ధమైన పరిమితులను అధిగమించి రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదని రాజ్యాంగ ధర్మాసనాలు ఎన్నోమార్లు స్పష్టం చేశాయి. సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. స్థానిక సంస్థల్లో రాజకీయోచిత వెనుకబాటుతనాన్ని నిర్ధారించేందుకు త్రిసభ్య కమిషన్ ద్వారా ట్రిపుల్ టెస్ట్ నిర్వహించకుండా , 50 శాతం సీలింగ్‌ను దాటుకుని ఏ రాష్ట్రమూ రిజర్వేషన్లు పొడిగించకూడదని పేర్కొంది. ఈ తీర్పులు ఉన్నప్పటికీ 34 శాతం కోటాతో జీవోలు తెచ్చి, అది కోర్టుల్లో చెల్లదని తెలిసీ సుప్రీంకోర్టుకు వెళ్లడం కేవలం రాజకీయ వ్యూహాల్లో భాగంగానే జరుగుతోంది. ఈ తరహా రాజకీయ వ్యూహాలు తెలుగు రాష్ట్రాలకు కొత్తవేమీ కావు. ఉమ్మడి ఏపీ సమయం నుంచి మొన్నటి తెలంగాణ పంచాయతీ ఎన్నికల వరకు కూడా ప్రభుత్వాలు 50 శాతానికి మించి బీసీ కోటాను పెంచుతూ నిర్ణయాలు తీసుకోవడం, న్యాయస్థానాలు వాటిని అడ్డుకోవడం క్రమబద్ధమైన పరిణామంగా మారింది. తెలంగాణలోనూ బీసీ రిజర్వేషన్లపై గతంలో తెచ్చిన ఆర్డినెన్సులు కోర్టుల్లో నిలబడలేక చివరకు 50 శాతం లోపే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ప్రభుత్వాలు రాజ్యాంగ నిపుణుల సలహాలు తీసుకోకుండా లేదా తెలిసీ విస్మరించి, ఎన్నికల ముందు భారీ రిజర్వేషన్ల హామీలు ఇవ్వడం ఒక అనవసర సంప్రదాయంగా మారింది. ఈ తరహా పరిమితికి మించిన రిజర్వేషన్ల హామీలు వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఇచ్చేవి కావు. ఇవి ప్రధానంగా ఓటు బ్యాంకులను ఆకట్టుకునేందుకు ఆడే రాజకీయ క్రీడ. బీసీ వర్గాల్లో అత్యాశలు, ఆకాంక్షలు రేకెత్తించడం, ఆపై జీవోలను సిద్ధం చేయడం, న్యాయస్థానాలు రాజ్యాంగ చట్రంలో వాటిని కొట్టేయగానే మేము బీసీలకు న్యాయం చేయాలని చూశాం, కానీ కోర్టులు అడ్డుకున్నాయి అంటూ సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం రాజకీయ పార్టీల పరిపాటిగా మారింది. దీనివల్ల అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగకపోగా, స్థానిక సంస్థల ఎన్నికలు సుదీర్ఘకాలం పాటు వాయిదా పడి స్థానిక పాలన స్తంభించిపోతోంది. వాస్తవానికి, బీసీలకు స్థానిక సంస్థల్లో చట్టబద్ధమైన అధిక ప్రాతినిధ్యం కల్పించాలనే నిజమైన చిత్తశుద్ధి ప్రభుత్వాలకు ఉంటే, ముందుగా ట్రిపుల్ టెస్ట్ ద్వారా క్షేత్రస్థాయి డాటాను సేకరించి, రాజ్యాంగ సవరణల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. లేదా 50 శాతం పరిమితికి లోబడే బీసీలకు గరిష్టంగా లబ్ధి చేకూరేలా సీట్ల కేటాయింపు చేయాలి. కానీ, ఆచరణాత్మక పరిష్కారాలను విస్మరించి, న్యాయపోరాటం పేరుతో కాలయాపన చేయడం వల్ల సమయం, ప్రజాధనం వృథా కావడం తప్ప మరే ఫలితం ఉండదు. హైకోర్టు తీర్పు ను బట్టి చూస్తే సుప్రీంకోర్టుకు వెళ్లినా ఏపీ ప్రభుత్వానికి ఉపశమనం లభించే అవకాశాలు అత్యల్పం. కాబట్టి కోర్టుల వల్ల జరగలేదనే రాజకీయ నెపం నెట్టడం ఆపి, సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడమే ప్రజాస్వామ్య బద్ధమైన మార్గం. బీసీ సమాజం కూడా కేవలం కాగితాలపై ఇచ్చే



34 శాతం హామీల కంటే, చట్టబద్ధంగా అమలుకు సాధ్యమయ్యే ప్రాతినిధ్యంపైనే స్పష్టమైన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

డేటాను పూర్తిగా పరిశీలించకుండానే

2025 డిసెంబర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ సర్వే నిర్వహించింది. రాష్ట్ర జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగం, ఇళ్లు, ఆస్తుల స్థితిగతులతో పాటు అన్ని కీలక వివరాలను సేకరించింది. 2026 జూన్‌లో ఈ వివరాలను స్థానిక సంస్థల ముందుంచి ప్రజలు వెరిఫై చేసుకునే అవకాశం కల్పించింది. మొత్తం 39 అంశాలపై సామాజిక ధ్రువీకరణ చేపట్టారు. ఈ డేటా ఆధారంగా రాష్ట్ర జనాభాలో బీసీలు దాదాపు 50.42% ((గ్రామీణ ప్రాంతాల్లో 48.84%, పట్టణాల్లో 54.35%) ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 1/3వ వంతు, గ్రామీణ స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు కల్పించడానికి రెండు జీవోలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో కె.కృష్ణమూర్తి, వికాస్ కిషన్‌రావ్ గాప్లీ, సురేష్ మహాజన్, బిర్రు ప్రతాప్‌రెడ్డి కేసుల్లో ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50%కి మించకూడదంటూ ప్రతివాదులు ఈ జీవోలను హైకోర్టులో సవాల్ చేశారు. ఆ తీర్పులు వెలువడే నాటికి, నేటికీ పరిస్థితులు మారాయని సమగ్ర కుటుంబ సర్వే తేల్చిందని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. రాజకీయ రిజర్వేషన్లను కేవలం జనాభా ఆధారంగా కాకుండా సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా చేపడుతున్నట్లు హైకోర్టుకు వివరించినట్లు ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ రిజర్వేషన్లు 50%కి మించకూడదన్న కారణంతో హైకోర్టు ఆ రెండు జీవోలను రద్దు చేసింది.కె.కృష్ణమూర్తి, వికాస్ గాప్లీ కేసుల్లో తీర్పులను లోతుగా విచారించి సేకరించిన డేటా అందుబాటులో ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించొచ్చు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని స్థానిక సంస్థలన్నీ ధ్రువీకరించాయి. ఆ ప్రక్రియ సరిగా జరిగిందా లేదా అని పరిశీలించడానికి బదులు హైకోర్టు దాన్ని పూర్తిగా రద్దు చేయడం సరికాదని సుప్రీంకోర్టు పిటిషన్‌లో పేర్కొంది. రిజర్వేషన్

పంటలు ఎండిపోతున్న ప్రభుత్వానికి పట్టదా..

హత్నూర, చేతికొస్తున్న వరి పంటలు ఎండిపోతుంటే నిరంతరం కరెంటు కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వానికి రైతుల కష్టాలు పట్టవా అంటూ సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్ సబ్ స్టేషన్ ఎదుట మంగాపూర్ గ్రామ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రైతులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పంట సాగు నుండి పంట చేతికొచ్చే దశ వరకు రైతులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్నటి వరకు యూరియా కోసం నానా ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వం చేతికొచ్చిన పంటలను దక్కించుకుందామంటే కరెంటు కోతలు విధిస్తూ పంటలు ఎండిపోయే దుస్థితికి తీసుకువస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏనాడూ ఇంతటి కష్టం రైతులకు రాలేదని ఇప్పుడే ఎందుకు ఇంత అద్వాన పరిస్థితులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు 24 గంటల కరెంటు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం కేవలం 6 గంటలు కూడా వ్యవసాయానికి సక్రమంగా ఇవ్వలేకపోతుందని ఆరోపించారు. రాత్రి సమయంలో కరెంటు కోతలు విధిస్తూ పగలు కరెంటు ఇస్తున్నాం అంటున్న విద్యుత్ అధికారులు పగలు సైతం సక్రమంగా ఇవ్వకపోగా ఇచ్చే కరెంటు సైతం లో వోల్టేజీ ఇస్తూ కోతలు విధిస్తుందన్నారు. దీంతో చేతికి వస్తున్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని లేని పక్షంలో ఎక్కడికక్కడ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

క్రికెట్ బ్రోచర్లను విడుదల చేసిన మంత్రులు

తెలంగాణలో డిగ్రీ కాలేజీ విద్యార్థుల్లో యువ క్రికెట్ ప్రతిభను వెలికితీసేందుకు టోర్నీ నిర్వహించడం అభినందనీయమని మంత్రులు దుద్ధిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లు తెలిపారు. సోమవారం మంత్రులు దుద్ధిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లు క్రికెట్ బ్రోచర్లను విడుదల చేశారు.జనవరిలో జరిగే ఈ టోర్నమెంట్ లో విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు చేస్తున్న క్రికిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ విద్యర్థులను ప్రోత్సహించేందుకు ఈ తరహా పోటీలు అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ కళాశాలల స్థాయిలో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు టీ 20 క్రికెట్ బాష్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఆకునూరు గౌతమ్, వి. అజయ్, రామకృష్ణలు తెలిపారు. ఈ టోర్నీలో ఆడి సత్తా చాటుకోవాలనుకునేవారు వెంటనే తమ పేర్లు నమోదు చేసుకోవాలి. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయ కానుంది. నాకౌట్ పద్ధతిలోజిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి తెలంగాణ రాష్ట్రాలలో కొత్త జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు అజయ్ 8186936117 నెంబర్లలో సంప్రదించాలి.

అప్పాజీపేటలో అర్ధరాత్రి మిస్టరీ

అనంతపురం ,అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. అవి ఎక్కడ నుంచి వస్తున్నాయో.. ఎలా పడుతున్నాయో అర్థం కాక గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు నిఘా పెట్టిన సమయంలో ఈ రాళ్లు పడ్డాయి. దీంతో ఇది ఏ దెయ్యం పనో అని గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్వామిజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. అయితే ఆకతాయిల పని అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రజలు మాత్రం రాత్రిపూట నిద్రపోలేకపోతున్నామని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించమని కోరుతున్నారు.అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో ఓ వింత పరిస్థితి నెలకొంది. ఆ గ్రామంలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. ఈ పరిణామంతో రాత్రైతే చాలు వణికిపోతున్న జనం.. ఆ ఊర్లో ఉండాలంటే భయపడిపోతున్నారు. ఈ ఘటన వల్ల ఇప్పటికే చాలా ఇళ్లు డ్యామేజ్ అయ్యాయి. ఇళ్ల పైకప్పులు పగిలిపోయాయి. ఆ రాళ్లు ఎక్కడ నుంచి వస్తున్నాయో తెలియక ఆ ఊరి ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. రాత్రి పూట అందరూ ఒకే చోటకు చేరుతున్నారు. ఈ విషయంపై ప్రజలు రకరకాలుగా ఆలోచనలు చేస్తున్నారు. ఎవరైనా కావాలనే చేస్తున్నారా? దైవం పనా? దెయ్యం పనా? అనే ఊహగానాలు జోరందుకున్నాయి.ఈ బాధ భరించలేక ప్రజలు చివరి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న తర్వాత నలుగురు పోలీసులు ఆ గ్రామంలో గస్తీ కూడా నిర్వహించారు. ఆ సమయంలో కూడా గాల్లోంచి రాళ్లు పడ్డాయి. అయినా ఫలితం లేకపోయింది. ఈ విషయంపై ప్రజలు స్వామిజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. పోలీసులతో పాటు సుమారు 20 మంది యువకులు కూడా ఈ మిస్టరీని ఛేదించడానికి కొండపైకి వెళ్లి పరిశీలించారు. అప్పుడు కూడా ఇళ్లపై రాళ్లు వచ్చి పడ్డాయి.దీంతో ఆ గ్రామ ప్రజలు ఇది కచ్చితంగా అదృశ్య శక్తుల పనే.. అని అనుమానిస్తున్నారు. అయితే అలాంటి దానికి ఆస్కారం లేదని, ఇది ఆకతాయిలు చేస్తున్న పనిగా కనిపిస్తుందని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే పోలీసులు నిఘా ఉన్న సమయంలో రాళ్లు ఎలా పడుతున్నాయో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు వ్యక్తులే కావాలనే రాళ్లు విసురుతూ భయాందోళనకు గురి చేస్తున్నారా? దీనికి ఇంకేదైనా కారణముందా? అనే కోణంలో దర్యాప్తు సాగుతుంది. అయితే రాళ్ల దాడి వల్ల ప్రజలు రాత్రిళ్లు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. ఎక్కువగా సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రాళ్లు పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. చాలామంది గ్రామానికి వచ్చి వీడియోలో, ఫోటోలు తీసుకెళ్తున్నారని కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. దీంతో తమకు భద్రత కల్పించాలని గ్రామస్థులు పోలీసులను కోరుతున్నారు.అయితే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇలా జరిగిన ఘటనలు అనేకం జరిగాయి. ప్రకాశం జిల్లా, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని గ్రామాల్లో అచ్చం ఇలాగే రాత్రైతే ఇళ్లపై రాళ్లు పడేవి. 'జన విజ్ఞాన వేదిక' ప్రతినిధులు, పోలీసులు నైట్ విజన్ కెమెరాలు పెట్టి దర్యాప్తు చేశారు. ఆ విచారణలో గ్రామస్థులే ఆస్తి తగాదాల వల్ల ఈ రాళ్లు విసిరినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో అప్పాజీపేటలో కూడా పోలీసులు సాధారణ గస్తీని నిర్వహించే బదులు సీసీ కెమెరాలు, డ్రోన్లు లేదా నైట్ విజన్ కెమెరాలు ఉపయోగిస్తే ఈ రాళ్ల వాన మిస్టరీ త్వరగా వీడే అవకాశం ఉంటుంది.

పారిశ్రామిక పెట్టుబడులకు.. మానవ వనరుల ఎర!



హైదరాబాద్, రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ పారిశ్రామిక విప్లవాన్ని ఆవిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్న రేవంత్ సర్కారు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, కంపెనీల పెట్టుబడుల కోసం మాస్టర్ ప్లాన్‌ను అమలు చేస్తోంది. దేశంలోనే మరెక్కడా లేని విధంగా అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందుబాటులోకి తీసుకువస్తోంది. పెట్టుబడులకు భద్రత కల్పించడంతో పాటు తక్కువ ధరలకే భూ కేటాయింపు, ఉచితంగా మౌళిక వసతుల కల్పన, రాయితీలు, ప్రోత్సాహకాలతో ఆకర్శించడంతో పాటు 'ఇదిగో మీ లక్ష్యాలను చేరుకునే నేటితరం యాంత్రిక మేధావులు' అంటూ అత్యాధునిక పద్ధతిలో శిక్షణ పొందిన వారి సంఖ్యను, వారి ప్రతిభను చూపి బహుళజాతి సంస్థలను ఆకర్శిస్తోంది.రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగర విస్తరణలో భాగంగా మెరుగైన పారిశ్రామిక విధానంతో భారీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్న ప్రజా ప్రభుత్వం.. అందుకు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో పాటు మెరుగైన మానవ వనరులను ఆవిష్కరిస్తోంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా మెరుగైన నైపుణ్య శిక్షణతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ)ను అందుబాటులోకి తీసుకువచ్చి మొదలుపెట్టిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుబంధంగా రాష్ట్రమంతా అన్ని పట్టణ కేంద్రాల్లో ఏటీసీలను దశల వారీగా ఆవిష్కరిస్తున్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంతో సామానంగా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు అదే స్థాయిలో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా యువతకు తిరుగులేని తర్ఫీదు ఇస్తున్నారు. 'మేక్ ఇన్ తెలంగాణ' నినాదం దేశానికే ఆదర్శంగా మారేలా స్వయం ఉపాధికి శాశ్వత బాటలు వేస్తున్నారు. తెలంగాణాలో పారిశ్రామిక శిక్షణ పొందితే చాలు..తొంభై శాతం జాబ్ గ్యారంటీ అన్న నమ్మకాన్ని పెంపొందించేలా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకువస్తున్నారు. నిరుద్యోగ యువతకు వెన్ను దన్నుగా నిలుస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో శిక్షణ పొందేందుకు విద్యార్థులు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏటీసీల్లో 12వేల సీట్లకు గానూ ఈ ఏడాది 18వేల పైచిలుకు దరఖాస్తులు రావడం పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలపై పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనంగా అధికారులు చెబుతున్నారు. ఇటీవల ఎలక్ట్రానికిక్ వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో 'ఈవీ' మెకానికల్ కోర్సులకు భారీగా డిమాండ్ కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఏసీటీల్లో ''ఇండస్ట్రీ-4.0'' కోర్సులు ప్రారంభం కావడంతో విస్తృత పారిశ్రామికీకరణకు మెరుగైన మానవ వనరులు అందుబాటులోకి వస్తున్నాయని, ఫలితంగా పెట్టుబడులకు మరిన్ని అవకాశాలు మెరుగుపడుతున్నాయని సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తాజాగా ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలోని అన్ని ప్రభుత్వ ఐటీఐలను ఆధునికీకరణ చేస్తున్నారు. ఈ కారణం వల్ల వాటిలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. చదువుతోపాటు తక్షణ ఉపాధి లభించేలా అధునాతన కోర్సులు (ట్రేడ్లు) డిజైన్ చేసి, టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో కలిపి నిర్వహిస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లలో ప్రవేశాలకు భారీగా డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ ఐటీఐలు, ఏటీసీల్లో కలిపి మొత్తం 12 వేల సీట్లు ఉండగా, ప్రస్తుత విద్యా సంవత్సరానికి 18 వేల పైచిలుకు దరఖాస్తులు రావడం' ప్రజా ప్రభుత్వం' ముందుచూపు నిర్ణయాలకు నిదర్శనంగా మారుతోంది.ప్రభుత్వపరంగా ఎన్ని రకాలుగా ప్రోత్సాహకాలు, రాయితీలు ఇచ్చినా.. భారీ పెట్టుబడులతో వచ్చే పరిశ్రమలకు మెరుగైన మానవ వనరులు అత్యంత ముఖ్యమైనందున దిశగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చర్యలు మొదలుపెట్టారు. కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోని ఏటీసీలపై ఏడాది క్రితమే అధ్యయనం చేసిన తెలంగాణ ప్రభుత్వం ఆధునిక కోర్సులు చేసిన వారికి 90శాతం ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. అదేమాదిరిగా రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఒక ఏటీసీ ఉండాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా తొలుత 65 ప్రభుత్వ ఐటీఐలను ఎంపిక చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి అప్‌గ్రేడ్ చేయటానికి పనులు చేపట్టారు. వాటిలో 25 చోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ 25 ఏటీసీలతో పాటు లదనంగా 20 కేంద్రాలను పెంచి ఆధునిక ట్రేడ్లలో ప్రవేశాలు కల్పించింది.ఇప్పుడున్న ఏటీసీలను దశల వారీగా బలోపేతం చేయడంతో పాటు త్వరలోనే మరో 45 ఏటీసీలు సైతం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణా శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు-పై గతేడాది టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ చేసుకుంది. రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేశారు. వాటికి అదనంగా ఐటీఐలు లేని నియోజకవర్గాల్లో ఒకటి చొప్పున ఏటీసీలను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ డిసైడయ్యారు. వాటిలో భాగంగా ఇప్పుడు కొత్తగా 46 ఏటీసీలను ఏర్పాటు చేస్తూ జీవో జారీచేశారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా యువత, విద్యార్థులను తీర్చిదిద్దేందుకు, ట్రైనింగ్ ఇచ్చేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. అధునాతన సామగ్రితో పాటు, కంప్యూటర్ల ద్వారా సాంకేతికతను ఏర్పాటు చేస్తారు. ఏటీసీల్లో ఆరు రకాల లాంగ్ టర్మ్ కోర్సులు, 23 రకాల షార్ట్ టర్మ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఏటీసీల్లో కేవలం వివిధ కోర్సుల్లో శిక్షణకే కాకుండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా పనిచేస్తాయని ప్రభుత్వం చెబుతోంది. సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలతో పాటు భారీ పరిశ్రమలకు సాంకేతిక కేంద్రాలుగా (టెక్నాలజీ హబ్) పనిచేయనున్నాయి. ఏటీసీల్లో ట్రైనింగ్ పొందిన వారికి టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగ అవకాశాలను కల్పించనుంది. భవిష్యత్‌లో ఏటీసీల్లో పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ స్టూడెంట్స్‌కు కూడా సేవలందించేలా ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తోంది.

అందుబాటులోకి లాంగ్ టర్మ్ కోర్సులు కూడా..

నిరుద్యోగ యువతలో ఆసక్తి పెరుగుతున్న కొద్దీ.. ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణా రంగంలో నూతన ఒరవడి తీసుకువచ్చే దిశగా చర్యలు మొదలుపెట్టింది. అందులో భాగంగా పారివ్రామిక శిక్షణా కేంద్రాల్లో లాంగ్ టర్మ్ కోరక్సులను కూడా ప్రవేశపెడుతున్నారు. కొత్తగా మంజూరైన ఏటీ-సీల్లో రెండేండ్ల లాంగ్ టర్మ్ కోర్సులుగా అడ్వాన్స్‌డ్ సీఎన్సీ మెషినింగ్ -టె-క్నీషియన్, ఎలక్ట్రిక్ వెహికల్ మెకానిక్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ ఎనాలసిస్ అండ్ డిజైనర్ (మెకానికల్) కోర్సులు ఉంటాయి. ఏడాది కోర్సులుగా మాన్యుఫ్యాక్చర్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఇంజనీరింగ్ డిజైన్ -టె-క్నీషియన్ కోర్సులు ఉంటాయి. వీటితో పాటు 23 షార్ట్ టర్మ్ కోర్సులకు అవసరమైన ఫ్యాకల్టీ, టూల్స్, మిషనరీతో పాటు మాస్టర్ -టైనర్లను కూడా టాటా కంపెనీయే సమకూర్చనుంది. వీటి ఏర్పాటుకు అవసరమైన భూమిని ప్రభుత్వం కేటాయించనుంది.ఆధునిక పరిజ్ఞానంతో కూడిన రోబోటిక్స్, డిజిటల్, ఎలక్ట్రిక్, ఆటోమేషన్ రంగాల్లో విద్యార్థులు, యువతకు ఒక్కో కేంద్రంలో ఏటా 500 మంది చొప్పున ట్రైనింగ్ ఇవ్వనుండడంతో ఉమ్మడి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో స్థానికులకు మంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 ఐటీఐలను గతేడాది ఏటీ-సీలుగా మార్చగా, ఖమ్మంలో ఒక ఐటీఐని ఏటీసీగా అప్ గ్రేడ్ చేశారు. ఇదే తరహాలో ప్రతి జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ కేంద్రంలోనూ ఏటీసీని నెలకొల్పి సమీప భవిష్యత్తులోనే మరింత మెరుగైన ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా రేవంత్ సర్కారు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది.

అన్ని ఏసీటీల్లో అందుబాటులోకి ''ఇండస్ట్రీ-4.0'' కోర్సులు

సంప్రదాయ ఐటీఐలకు భిన్నంగా ఏటీసీల్లో 'పరిశ్రమ 4.0' ఆధారిత కోర్సులను రూపొందించారు. వీటికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గత ఏడాది ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ప్రాక్టికల్స్, ఇతర శిక్షణ కార్యక్రమాలకు అధునాతన మిషనరీ అందుబాటులోకి తెచ్చారు. ఈ సంవత్సరానికి వచ్చిన దరఖాస్తుల్లో ఏటీసీల్లోని రెండు, మూడేళ్ల కాలపరిమితితో ఉన్న ట్రేడ్లలోనే చేరేందుకు ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మెకానిక్ (ఎలక్ట్రిక్ వెహికల్), మెకానికల్ (బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్), అడ్వాన్స్‌డ్ సీఎన్సీ టెక్నీషియన్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, మాన్యుఫ్యాక్చర్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ తదితర కోర్సులు ఉన్నాయి. కొత్తగా ఐదు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) మంజూరు చేసింది. ఖమ్మం జిల్లాకు మూడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రెండు ఏటీసీలను కేటాయించింది. పాలేరు నియోజకవర్గానికి గాను తిరుమలాయపాలెంలో, వైరా నియోజకవర్గానికి గాను ఏన్కూరు మండలం తూతక్కలింగన్నపేటలో, సత్తుపల్లి నియోజకవర్గానికి మంజూరైన కేంద్రం సత్తుపల్లి మండలం తుంబూరులో ఏర్పాటు చేయనున్నారు.

బిజేపీ బూచి రాజకీయాలకు ముగింపు



చెన్నై, తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ దేశ రాజకీయాలకు భిన్నమైన వైఖరితో నడుస్తుంటాయి. ద్రవిడ భావజాలం, స్వయంప్రతిపత్తి నినాదాలతో దశాబ్దాలుగా కేంద్రంలోని బీజేపీని బద్ధ శత్రువుగా చిత్రీకరిస్తూ నడిచిన తమిళ రాజకీయం.. ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. ఒకప్పుడు బీజేపీని , కాషాయ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ భావజాలం కనుమరుగై, అన్ని ప్రధాన శక్తులూ కేంద్రంతో ఘర్షణను పక్కనపెట్టి వ్యూహాత్మక సర్దుబాట్ల వైపు అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రధాన పార్టీ కూడా ఇప్పుడు బీజేపీపై బాహాటంగా యుద్ధం ప్రకటించే స్థితిలో లేకపోవడం సరికొత్త రాజకీయ వాస్తవికతను ఆవిష్కరిస్తోంది.ఒకవైపు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న అన్నాడీఎంకే మళ్లీ అధికారికంగా ఎన్డీయే గూటికి చేరి బీజేపీతో పొత్తును కొనసాగిస్తుండగా.. అధికారం కోల్పోయిన ద్రవిడ మున్నేట్ర కళగం వైఖరిలో వచ్చిన విస్మయకర మార్పు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఓటమి ఎదురైన వెంటనే కాంగ్రెస్‌తో బంధాన్ని తెంచుకుని దూరంగా జరిగిన డీఎంకే.. ఇప్పుడు బీజేపీపై ఒక్క విమర్శ కూడా చేయకుండా పూర్తిగా మౌనముద్ర దాల్చింది. సనాతన ధర్మం, హిందీ వ్యతిరేకత, కేంద్ర నిధుల వివక్ష అంటూ గతంలో రోజూ విరుచుకుపడే ఉదయనిధి స్టాలిన్ వంటి దూకుడు నేతలు సైతం ఇప్పుడు కేంద్రంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేయకుండా నోరు కట్టేసుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల భయం, ద్రవిడ ఓటు బ్యాంకులో మార్పులు డీఎంకేను బీజేపీపై సైలెంట్ అయ్యేలా ఒత్తిడి చేశాయన్నది బహిరంగ రహస్యం.మరోవైపు నూతన రాజకీయ శక్తిగా అవతరించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తలపతి విజయ్ నేతృత్వంలోని టీవీకే తీరు మరింత ఆసక్తికరంగా ఉంది. కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర పార్టీల మద్దతుతో సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్ పేరిట సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్నప్పటికీ.. విజయ్ జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ కూటమి ప్రాబల్యంలోకి వెళ్లలేదు. ఢిల్లీ వేదికగా ఇండియా కూటమి కేంద్ర ఎన్నికల సంఘంపై సాగిస్తున్న సేవ్ డెమోక్రసీ ఉద్యమానికి గానీ, ఈవీఎంల వ్యతిరేక ప్రచారాలకు గానీ విజయ్ ప్రభుత్వం ఎలాంటి మద్దతు ప్రకటించకపోవడం గమనార్హం. కాంగ్రెస్‌ను తన కూటమిలో ఒక భాగస్వామిగా మాత్రమే ఉంచుకుంటూ.. ఢిల్లీ స్థాయిలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో ఎటువంటి ఘర్షణాత్మక వైఖరి లేకుండా సమదూర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు.గతంలో తమిళనాడు ఎన్నికల్లో బలంగా పనిచేసిన యాంటీ-బీజేపీ సెంటిమెంట్ ఇప్పుడు తన పదును పూర్తిగా కోల్పోయింది. అన్నాడీఎంకే పొత్తుతో ఉండగా, అధికారం కోల్పోయిన డీఎంకే రాజీ ధోరణిలోకి వెళ్లిపోయింది. అటు కొత్తగా అధికారంలోకి వచ్చిన విజయ్ టీవీకే కేంద్రంతో ఘర్షణ పడే సాహసం చేయడం లేదు. ఈసీ వ్యవహారాలు, కేంద్ర విధానాలపై తమిళనాడు పార్టీలు గళం విప్పకపోవడం.. ద్రవిడ ఉద్యమ పునాదుల్లో సిద్ధాంతాల కంటే అధికార మనుగడ, లబ్ధి మాత్రమే మిగిలాయని నిరూపిస్తోంది. ఒకప్పుడు తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన్న బీజేపీ.. నేడు తమిళనాట తన వ్యతిరేకతను పూర్తిగా పలుచన చేసి, రాష్ట్ర రాజకీయాలను తన నియంత్రణలోకి తెచ్చుకోవడంలో తెరవెనుక వ్యూహాత్మక విజయం సాధించిందని అనుకోవచ్చు.

వైసీపీకి అభ్యర్థుల కష్టాలు

నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీకి అనేక ఇబ్బందులున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి వ్యయంతో పాటు అధికార పార్టీని ఎదుర్కొనడం అంత సులువుకాదు. మంచి అభ్యర్థులున్నా అధికార పార్టీని తట్టుకోవడం అంత ఈజీ కాదు. ఎందుకంటే.. అన్ని వైపుల నుంచి వత్తిడులు ఉంటాయి. ప్రజలు సహజంగా అధికార పార్టీ కి మద్దతుగా నిలిచేందుకు ఇష్టపడతారు. దీంతో ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అభ్యర్థుల వ్యయం కూడా వైసీపీకి ఇబ్బందిగా మారనుంది. మరొకవైపు పోలీసు కేసులు, ఇతర ఇబ్బందులు పార్టీ కార్యకర్తలను పోలింగ్ కేంద్రాల వద్దకు రావడం కూడా అంత సులువు కాదు. ఇవన్నీ అధిగమించడంతో పాటు ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఇబ్బందులు కలగొచ్చు. ఆంధ్రప్రదే హైకోర్టు తీర్పు వెలువరించడం మరియు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎదుర్కొంటున్న ప్రధాన ఇబ్బందులు, సవాళ్లు అనేకం ఉన్నాయి. ఎన్నికల వాయిదా ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదని వైసీపీ వేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఆరు వారాల్లోపు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించడంతో వైసీపీ వ్యూహానికి ఎదురుదెబ్బ తగిలింది. గత సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో ఇంకా పూర్తి స్థాయిలో మనోధైర్యం రాలేదని, క్షేత్రస్థాయిలో నాయకులు, అభ్యర్థుల లభ్యతపై సందిగ్ధత ఉందనే చర్చ జరుగుతోంది.అన్ని స్థానాల్లోనూ కచ్చితంగా పోటీ చేయాలని పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, అధికార కూటమి ప్రభుత్వంలో స్థానికంగా ఎదురుదెబ్బలు తగులుతాయనే ఆందోళన కొందరిలో ఉంది. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇష్టపడే అభ్యర్థులు కూడా కొంత కష్టంగానే కనిపిస్తారుఅభ్యర్థులను బలవంతంగా ఎంపిక చేసినప్పటికీ వారు ఖర్చు పెట్టుకునేందుకు ముందుకు రారు. అధికార పార్టీకి ధీటుగా తాము ఖర్చు చేయలేమని ముందుగానే చేతులెత్తాస్తారు. అది పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జులకు భారంగా మారనుంది. ఆర్థిక భారాన్ని ఇన్ ఛార్జులు భరిస్తారా? లేక పార్టీ నాయకత్వం భరిస్తుందా? అన్న దానిపై స్పష్టత లేదు. దీం

టీడీపీకి బరువుగా మారిన కొలికపూడి?



అమరావతి,అధికారంలో ఉన్న వేళ అధినేతకు అండగా నిలుస్తూ.. అవసరం ఉన్నా లేకున్నా విపక్షంపై విరుచుకు పడుతూ.. తనకు మించిన విధేయత మరెవరిలోనూ కనిపించదన్నట్లుగా వ్యవహరించే తీరును కొందరు నేతలు ప్రదర్శిస్తుంటారు. అదే సమయంలో చేతిలో అధికారంలో ఉన్నప్పుడు వెనుకా ముందు చూసుకోకుండా వ్యవహరించే అతి నేతలకు కొదవ ఉండదు. ఇందుకు భిన్నంగా అవసరం ఉన్నా.. లేకున్నా.. అదే పనిగా వివాదాల్లో చిక్కుకుంటూ అసంతృప్త నేతగా ముద్ర వేయించుకునే తీరుకు వీలైనంత దూరంగా వ్యవహరిస్తుంటారు. అందులోని ప్రాంతీయ పార్టీలో ఈ తరహా వైఖరి నేతల రాజకీయ ఫ్యూచర్ కు ఏ మాత్రం మంచిది కాదు. అందుకే తోక జాడించేందుకు జంకుతుంటారు. ఇందుకు భిన్నమైన వ్యవహారశైలితో తరచూ వార్తల్లోకి ఎక్కుతున్నారు తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.కారణం ఏదైనా కానీ వివాదాలతో సహజీవనం చేస్తున్న ముద్రను వేసుకున్నారు కొలికపూడి. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ విపక్షంలో ఉన్న వేళ.. అమరావతి రాజధాని ఉదంతంలోనూ.. రాజధాని రైతులు చేసిన పోరాటంలో కీలకభూమిక పోషించిన ఆయన.. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత మాత్రం ఆయన వ్యవహారశైలిలో మార్పు వచ్చిందన్నమాట అంతకంతకూ ఎక్కువ అవుతోంది. ఈ మధ్యనే విస్సన్నపేట మండలం నరసాపురం జెడ్పీహెచ్ స్కూల్ పీఈటీగా పని చేస్తున్నరమేశ్ అనే టీచర్ ను.. డిప్యూటీ డీఈవో ద్వారా తన ఇంటికి పిలిపించుకొని ఇష్టమొచ్చినట్లుగా తిట్టటమే కాదు.. కర్రతో కొట్టినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి.ఈ అంశాన్ని అధికార పార్టీకి చెందిన రాష్ట్రసామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య స్పందిస్తూ.. ఎమ్మెల్యే కొలికపూడి తీరుతో అటు పార్టీకి.. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని పేర్కొంటూ ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలంటూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు నివేదించటం గమనార్హం. పీఈటీ టీచర్ ను ఇంటికి పిలిపించిన మాట వాస్తవమేనని.. గత ఏడాది పదో తరగతి ఫలితాలు సరిగా రాలేదని.. ఆటల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టటం వల్లే చదువు దెబ్బ తింటోందన్న ఫిర్యాదు నేపథ్యంలో విద్యా శాఖ అధికారులతో కలిసి ఇంటికి పిలిపించి.. సమీక్షించినట్లుగా పేర్కొన్నారు.తాను కొట్టలేదని.. తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా రియాక్టు కావటమే కాదు సవాలు విసిరారు. తనపై తప్పుడు ప్రచారం జరుగుతుందని.. అలా చేస్తున్న వారిని తాను విడిచి పెట్టనంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇలా కొలికపూడిపై వచ్చే వివాదాలకు ఇదో ఉదాహరణ మాత్రమే. ఆయనపై తరచూ ఏదో ఒక విమర్శ.. ఆరోపణ వస్తూనే ఉంటుంది. తాజాగా తన వాట్సప్ స్టేటస్ లో తన నియోజకవర్గంలో చేపట్టే డెవలప్ మెంట్ కార్యక్రమాలకు ప్రోటోకాల్ పాటించకుండా ప్రవర్తిస్తున్నారని.. అందుకు తన సామాజిక ప్రాతినిధ్యాన్ని ప్రస్తావిస్తూ పెట్టిన పోస్టులు తాజా ఇష్యూగా మారింది.తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు.. విజయవాడ ఎంపీ కేశినేని చిననికి మధ్య రచ్చ అంతకంతకూ పెరగటం.. ఇదో అధిపత్య పోరుగా మారిందన్న మాట బలంగా వినిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాల పీఈటీ టీచర్ పై దాడి ఆరోపణలను పక్కదారి పట్టించటానికి ప్రోటోకాల్ పంచాయితీని తెరమీదకు తెచ్చారన్న ప్రచారం సాగుతోంది. అయితే.. స్కూల్ టీచర్ ఇష్యూలోనూ ఎంపీ హస్తం ఉందని.. తనను రాజకీయంగా దెబ్బ తీయటానికి ఇలాంటి ప్రచారాలు చేస్తున్నట్లుగా వ్యాఖ్యానిస్తున్నారు.తమది ఎస్సీ నియోజకవర్గం కావటంతో తనపై వివక్ష ప్రదర్శిస్తున్నారంటూ ప్రభుత్వ ఇమేజ్ ను సైతం దెబ్బ తీసేలా కొలికపూడి తీరు ఉందన్న వాదన పార్టీలో ఈ మధ్యన పెరిగింది. మొత్తంగా నియోజకవర్గంలోని అధికారపార్టీ నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు ముదిరి పాకాన పడటమే కాదు.. ఇవన్నీ కలిసి కూటమి సర్కారు ఇమేజ్ ను దెబ్బ తీసే స్థాయిలో ఉంటున్నట్లుగా చెబుతున్నారు. తిరువూరు నియోజకవర్గం పరిధిలో జరిగే ఏ అధికారిక కార్యక్రమానికైనా స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షత వహించటం మామూలే. అలాంటివి తిరువూరులో జరగటం లేదని.. దీనికి ఎంపీ కేశినేని కారణంగా కొలికపూడి వర్గీయులు ఆరోపిస్తున్నారు.అమరావతి ఉద్యమ నేపథ్యంలో పార్టీకి దన్నుగా నిలవటం.. దళిత సెంటిమెంట్ లాంటి అంశాలే అధినేత చంద్రబాబు ఆయనపై చర్యలు తీసుకోవటానికి తటపటాయిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి పార్టీ లైనుకు భిన్నంగా వ్యవహరించే నేతలపై చర్యల కొరడా ఝుళిపించే విషయంలో చంద్రబాబు ట్రాక్ రికార్డు అంత బాగా కనిపించదు. ఓపిక పడుతూ.. వేచి చూసే ధోరణిని ప్రదర్శిస్తుంటారు. రాజధాని అమరావతి అంశంలో పోరాడిన ఉద్యమ నేత ఇమేజ్ ఉన్న కొలికపూడిపై చర్యలు తీసుకుంటే తప్పుడు సంకేతాలు పంపినట్లు అవుతుందన్న అభిప్రాయం చంద్రబాబులో ఉందని.. అందుకే ఆయన చర్యలకు వెనుకాడుతున్నట్లుగా చెబుతున్నారు.చర్యల సంగతిని పక్కన పెడితే.. నియోజకవర్గంలోని అధిపత్య పోరుకు పరిష్కారాన్ని చూపినా బాగుంటుంది కదా? అన్న ప్రశ్న వినిపిస్తోంది. ఇరువురు నేతల మధ్య నెలకొన్న వర్గ పోరును చక్కదిద్దేందుకు ఇప్పటికే పార్టీ క్రమశిక్షణా కమిటీని రంగంలోకి చంద్రబాబు దించినా.. పెద్దగా ప్రయోజనం లేదన్న మాట వినిపిస్తోంది. ఇప్పటికే కమిటీ ద్వారా రిపోర్టు తెప్పించుకున్నప్పటికి చర్యల కంటే కౌన్సెలింగ్ మార్గాన్నిఅధినేత ఎంచుకున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే కొలికపూడి వ్యవహారశైలిని చంద్రబాబు తప్పు పట్టారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే సహించనని స్పష్టం చేసినా.. పరిస్థితిలో అయితే మార్పు రావటం లేదు. అంతేకాదు.. వ్యవహారశైలిని మార్చుకోకపోతే పార్టీ తరపు గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించినా.. పరిస్థితుల్లో మార్పు రాలేదు. మొత్తంగా చూస్తే.. పార్టీకి ప్రభుత్వానికి బరువుగా మారిన కొలికపూడి విషయంలో ఏదో ఒక నిర్ణయాన్ని అధినేత తీసుకోవాలన్న మాట తరచూ వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి.

లోకేల్ పోల్స్‌పై సజ్జల వర్సెస్ జగన్ సైలెంట్ వార్!



అమరావతి, ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎన్నికల వ్యూహంపై అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డిల మధ్య తీవ్రస్థాయిలో అభిప్రాయ భేదాలు రాజుకున్నట్లు తాడేపల్లి వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అధికారం కోల్పోయిన తర్వాత క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగం నిర్వీర్యమైపోవడం, వరుసగా నేతలు పార్టీని వీడుతుండటంతో.. అసలు స్థానిక పోరులో బరిలోకి దిగాలా వద్దా అనే అంశంపై పార్టీ అగ్రనాయకత్వం రెండు పక్షాలుగా చీలినట్లు తెలుస్తోంది. ప్రత్యక్ష పోరుకు దిగడం కంటే ఎన్నికల బహిష్కరణే మేలని సజ్జల సూచిస్తుంటే, వెనకడుగు వేస్తే పార్టీ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని జగన్ పట్టుబడుతున్నట్లుగా చెబుతున్నారు.

సజ్జల లెక్కలు క్లియర్

సజ్జల రామకృష్ణారెడ్డి ఆలోచన వెనుక పక్కా రాజకీయ లెక్కలు, భయాలు ఉన్నాయని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. జగన్ సొంత ఇలాకా అయిన పులివెందుల నియోజకవర్గంలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లోనూ వైసీపీ ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. సొంత గడ్డపైనే పరువు కాపాడుకోలేని దుస్థితిలో ఉన్నప్పుడు, రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వ హవా కొనసాగుతున్న తరుణంలో ఎన్నికలకు వెళితే అభ్యర్థులే దొరకరని, కనీసం గట్టి పోటీ కూడా ఇవ్వలేమని సజ్జల అంతర్గతంగా వాదిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఏకపక్షంగా కూటమి క్లీన్‌స్వీప్ చేస్తే, మిగిలిన అరకొర క్యాడర్ కూడా పూర్తిగా చేజారిపోతుందని, అందుకే అధికార దుర్వినియోగం, ఈసీ పక్షపాతం అనే నెపంతో ఎన్నికలను బహిష్కరిస్తే పరువు దక్కుతుందని ఆయన ప్రతిపాదించినట్లు చెప్పుకుంటున్నారు.

పోటీ చేయాలన్న పట్టుదలతో సజ్జల

అయితే వైఎన్ జగన్ మాత్రం ఈ సూచనను ఏమాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు. రాజకీయాల్లో పోరాటం చేయకుండా బరిలోంచి పారిపోవడం తన ఇంటా వంటా లేదని, ఎన్నికలను బహిష్కరిస్తే ప్రత్యర్థుల ముందు పూర్తి లొంగుబాటు ప్రకటించినట్లవుతుందని జగన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిస్తోంది. అంతేకాకుండా ఎన్నికలు బహిష్కరిస్తే గ్రామీణ స్థాయిలో వైసీపీ ఉనికి నామరూపాలు లేకుండా పోతుందని, గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి స్థానంలోనూ పోటీ చేసి తీరాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ క్రమంలోనే సజ్జల పాత్రను పక్కన పెట్టి, తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో జగన్ స్వయంగా వరుసగా పది గంటల పాటు రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో వన్-టు-వన్ సమీక్షా సమావేశాలు నిర్వహించి క్లాస్ పీకారు.

సజ్జలను పక్కన పెట్టి జగన్ సమీక్ష

జగన్ నిర్వహించిన ఈ కీలక సమావేశాల్లో సజ్జల రామకృష్ణారెడ్డి ఉనికి కేవలం నామమాత్రంగానే పరిమితమైందన్నది తాడేపల్లి ఇన్‌సైడ్ టాక్. గతంలో ప్రతి సమీక్ష, విధానపరమైన నిర్ణయంలో అధిపత్యం చలాయించిన సజ్జల, తాజా సమీక్షల్లో మౌనంగా ఉండిపోవాల్సి వచ్చింది. డబ్బులు లేవు.. క్యాడర్ భయపడుతోంది అంటూ సన్నాయి నొక్కులు నొక్కిన నేతలకు జగన్ సీరియస్ వార్నింగ్‌లు ఇస్తూ, ఒక్కో స్థానానికి ముగ్గురేసి అభ్యర్థుల పేర్లను పక్కాగా సిద్ధం చేయాలని ఆదేశించడంతో కథ అడ్డం తిరిగింది. అధినేత పట్టుదల ముందు తన బహిష్కరణ వ్యూహం వీగిపోవడంతో సజ్జల తప్పనిసరి పరిస్థితుల్లో రాజీపడాల్సి వచ్చింది. ప్రభుత్వ బెదిరింపులను ధైర్యంగా ఎదుర్కొని బరిలో నిలవాలంటూ,లీగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలంటూ ఆయన నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ, ఆయన మాటల్లో మునుపటి ఉత్సాహం కనిపించడం లేదని క్యాడర్ గుసగుసలాడుకుంటోంది. పార్టీలో అంతర్గతంగా భరోసా లేకపోవడం, అగ్రనేతల మధ్య వ్యూహాత్మక విభేదాలు రచ్చకెక్కడం స్థానిక పోరులో వైసీపీ కొంపముంచుతుందా లేక జగన్ మొండితనమే పార్టీని గట్టెక్కిస్తుందా అన్నది వేచి చూడాలి.

కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేస్తే నాలుక కోస్తాం జాగ్రత?



హైద్రాబాద్ ,కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డి పై తప్పుడు ఆరోపణలు చేస్తే నాలుక కోస్తాం జాగ్రత? అనిటీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం హెచ్చరించారు. గాంధీ భవన్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ కేటీఆర్ కు దమ్ముంటే సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం ఆస్తులపై ఆధారాలు ఉంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ హైటెక్ సిటీలో యశోద ఆసుపత్రికి 210 కోట్ల ఎకరాల ప్రభుత్వ భూమిని 33కోట్లకు ఇచ్చారు. కరోన టైం లో యశోద ఆసుపత్రి 3వేల కోట్లు సంపాదించాడు. యశోద ఆసుపత్రికి ఎకరానికి 11కోట్ల చొప్పున 3ఎకరాలకు డబ్బులు ఇచ్చిండు. రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా పెట్టిండన్నారు. గజం లక్షా 50వేల ఉంటే గజం 33వేల కే ఇచ్చిండు. 16.06.205 జీవో 82,సర్వే నినీ.41/147.10.2015 జివో 191 ద్వారా యశోద ఆసుపత్రికి భూమిని ధారా దత్తం చేసిండు. 2015 లో కేటీఆర్ కు 15 శాతం వాటా ఇచ్చిండు, వాటి మీద ఇప్పుడు విచారణ జరుగుతుంది. కేటీఆర్ కు మతి స్థిమితం లేదు. పిచ్చి లేచి రోడ్ల పై తిరుగుతుండు.కేటీఆర్ ను ఎర్రగడ్డ కు పంపించాల్సిందే. కేటీఆర్ చెంచా గాళ్లతో మాట్లాడిస్తున్నారు. మోడీకవర్ ఇప్పుడు పెట్టింది కాదు,సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభానికి మాత్రమే పోయాడు. మోడీకవర్ ఎండి డాక్టర్ అనిల్ కృష్ణ 42 మంది డైరెక్టర్లు. మెడికవర్ ఎండి అనిల్ కృష్ణ ను బెదిరించి కేటీఆర్ పది ఏండ్లు ఏడాదికి 10 కోట్లు లాగా 100 కోట్లు తీసుకుండు. కేటీఆర్ ఎపి అమరావతి లో 1000 కోట్లతో భార్య శైలిమా ఒరుతో హోటల్ కట్టిండు. కోహినూర్ హోటల్ లో బెదిరించి 25శాతం వాటా తీసుకున్నాడని ఆరోపించారు. కేటీఆర్ అయ్యకు అబ్బకు పుట్టి ఉంటే వాస్తవం కాదని చెప్పాలి.

మా ముఖ్యమంత్రి గా ప్రమాణం స్వీకారం చేసినప్పటినుండి ఒక్క రూపాయి లేదు. నేను చూపించే హోటల్స్ ఆధారాలు అన్ని కేటీఆర్ ఒప్పుకుండు. 2021 లో జగన్ కు డబ్బులు ఇచ్చిండు. మెడికవర్ తో సీఎం రేవంత్ రెడ్డికి సంబంధం లేదు. రేవంత్ రెడ్డి కుటుంబానికి సంబంధం ఉంటే ఆధారాలు యట పెట్టాలి. మాక్సిన్ ఫార్మా కంపెనీ 31.03 2023 ఈతీబ హయాంలో పెట్టారుమాక్స్ బిన్ తో ముఖ్యమంత్రి కి సంబంధం ఏముందని ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు 2023 లో సీఎం రేవంత్ రెడ్డి అల్లుడికి 16శాతం వాటా ఉందిస్వాచ్ బయో కంపెనీ జూన్ 24. 2025 లో ప్రారంభం అయిందిపసుపునూరి హరివర్దన్ రెడ్డి డైరెక్టర్ ముఖ్యమంత్రి కి సంబంధం లేదుసోదా కన్స్ట్రక్షన్ కంపెనీమాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి కొడుకుది. 2010 జూలై 12 న కంపెనీ పెట్టారుకేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు గీత హుందాయి షో రూమ్ 2021 లో పెట్టారుసీఎం రేవంత్ రెడ్డి సతీమణి ఫ్యామిలీ ముందు నుండే ఉన్నత కుటుంబం. అపుడు రేవంత్ రెడ్డి మంత్రి కాదు, ముఖ్యమంత్రి కాదుమైండ్ వాల్ట్ కార్పోరేట్ స్కూల్ సీఎం రేవంత్ రెడ్డి కూతురిది అని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తుండుమైండ్ వాల్ట్ కార్పోరేట్ స్కూల్ హైదరాబాద్ లేదు2014 ముందు కేటీఆర్ కు ఒక్క రూపాయి లేదు2014 తర్వాత వేల కోట్లు ఎట్లా వచ్చినవి కేటీఆర్? అని ప్రశ్నించారు.దొర అహంకారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తే కేటీఆర్ ను తన్ని తరిమివేస్తారుచెంచా గాళ్లతో ప్రెస్మీట్ పెట్టిస్తే తెలంగాణ ప్రజలు నమ్మరన్నారు.

ఆ రూట్‌లో ఇక ట్రాఫిక్ కష్టాలు తగ్గేనా?



హైదరాబాద్, ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న తూర్పు హైదరాబాద్ వాసులకు కీలక అప్డేట్ వచ్చింది. ఎల్‌బీనగర్--హయత్‌నగర్ మధ్య ప్రతిపాదించిన డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. గుజరాత్‌లో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన ఆయన.. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న రహదారి ప్రాజెక్టులు, అనుమతులు, నిధుల అంశాలపై చర్చించారు.

ఎల్‌బీనగర్-హయత్‌నగర్ కారిడార్‌కు అనుమతులు కోరిన మంత్రి

తూర్పు హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రతిపాదించిన ఎల్‌బీనగర్--హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతులు మంజూరు చేయాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. సుమారు 6 కిలోమీటర్ల మేర ఈ కారిడార్‌ను నిర్మించాలనే ప్రతిపాదన ఉందని, 2026--27 వార్షిక ప్రణాళికలో దీనికి ఆమోదం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

భవిష్యత్ మెట్రో విస్తరణకు అనుగుణంగా నిర్మాణం

కారిడార్ నిర్మాణంలో ఆర్ఈ వాల్ విధానానికి బదులుగా వయాడక్ట్ విధానాన్ని అనుసరించాలని మంత్రి సూచించారు. భవిష్యత్‌లో చేపట్టే మెట్రో విస్తరణకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రాజెక్టును రూపొందించాలని కోరారు. ఈ మార్గంలో మౌలిక వసతుల అభివృద్ధి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండాలని వివరించారు.ఎల్‌బీనగర్-హయత్‌నగర్ మార్గం హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే జాతీయ రహదారికి అనుసంధానమై ఉండటంతో ఈ రూట్‌లో

ప్రతిపక్షం స్థాయికి కాక్రోచ్ లు



న్యూఢిల్లీ అక్టోబరు 6,భారత జాతీయ రాజకీయాల్లో ప్రధాన ప్రతిపక్షాలు ఇతరులకు తోక పార్టీలుగా మారిన తీరు దేశ ప్రజాస్వామిక చరిత్రలోనే మునుపెన్నడూ చూడని విచిత్ర స్థితిని ఆవిష్కరిస్తోంది. వందేళ్లకు పైగా చరిత్ర, దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన నేపథ్యం ఉన్న కాంగ్రెస్ పార్టీ మొదలుకుని.. ప్రాంతీయ అస్తిత్వాలతో పుట్టుకొచ్చిన విపక్షాల వరకు అన్నీ నేడు స్వయంప్రకటిత కాక్రోచ్ జనతా పార్టీకి తోకలుగా మారిపోయాయి. ప్రజాసమస్యలపై స్వతంత్రంగా ప్రజలను కూడగట్టి ఉద్యమాలు నిర్మించే సత్తా నశించిపోవడంతో, సోషల్ మీడియా ఆధారిత కాక్రోచ్ బ్యాండ్‌వాగన్‌ను ఎక్కి తమ ఉనికిని కాపాడుకునేందుకు విపక్షాలన్నీ తహతహలాడుతున్నాయి. తాము అజెండా నిర్దేశించాల్సింది పోయి, ఒక అపరిపక్వ డిజిటల్ గ్రూప్ వెనుక దాక్కుని యాత్రలు, ధర్నాలు నిర్వహించడం ప్రధాన విపక్షాల రాజకీయ శూన్యతను స్పష్టంగా బయటపెడుతోంది.ఇటీవల ముంబైలోని శివాజీ పార్క్, దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికలుగా కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో జరిగిన నిరసనలను గమనిస్తే ఈ రహస్యం సులువుగానే అర్థమవుతుంది. ఎన్నికల సంఘంపై నిందలు వేయడమే ఏకైక పనిగా పెట్టుకున్న ఇండియా కూటమి పార్టీలు, నేరుగా తమ పార్టీ జెండాలతో బయటకు వస్తే ప్రజల్లో మైలేజ్ రాదని గ్రహించాయి. అందుకే సీజేపీ అనే బోర్డును ముందుంచి, తెరవెనుక నుంచి కాంగ్రెస్, ఆప్, లెఫ్ట్ తదితర విపక్షాలు ఈ ఉద్యమాలకు తెరతీశాయి. పేరుకు యువత, జెన్-జీ ఆందోళనలని సోషల్ మీడియాలో డబ్బా కొట్టుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బారికేడ్లను నెట్టి, పోలీసులతో ఘర్షణ పడుతూ అరెస్టులవుతున్న వారిలో అత్యధికులు ఆయా రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి, యువజన విభాగాల కార్యకర్తలేనన్నది బహిరంగ రహస్యం.వాస్తవానికి నేటి సరికొత్త తరం యువతకు తమ కెరీర్, నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు, స్టార్టప్‌లే ప్రధానం తప్ప.. ఇలాంటి రాజకీయ ముసుగుల కోసం నెలల తరబడి రోడ్లెక్కి నిరసనలు చేసే తీరిక, ఆసక్తి ఎంతమాత్రం లేవు. కేవలం కొందరు డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, సోషల్ మీడియా రీల్స్ సరదాతో వైరల్ అవుతున్న హైటెక్ ఆందోళనకారులను అడ్డం పెట్టుకుని, పార్టీల క్యాడర్‌ను తరలించి ఒక కృత్రిమ ప్రజా తిరుగుబాటును సృష్టించేందుకు విపక్షాలు పడరాని పాట్లు పడుతున్నాయి. ప్రస్తుతం దేశ రాజకీయ ముఖచిత్రంలో అసలైన ప్రధాన ప్రతిపక్షంగా కాక్రోచ్ లే వ్యవహరిస్తుండగా, పార్లమెంట్‌లో కూర్చున్న కాంగ్రెస్ వంటి వ్యవస్థాగత పార్టీలన్నీ నామమాత్రపు దమ్మీ లుగా మిగిలిపోయాయి.కేంద్ర ప్రభుత్వాన్ని విధానపరంగా నిలదీయడంలో, పాలనాపరమైన వైఫల్యాలపై ప్రజల్లో బలమైన చర్చను లేవనెత్తడంలో అధికారిక విపక్షాలు ఘోరంగా చేతులెత్తేశాయి. తమ స్వయంకృతాపరాధాలతో ప్రజల విశ్వసనీయతను కోల్పోయి, ఇప్పుడు ఒక నాన్-పొలిటికల్, నాన్-సీరియస్ గ్రూప్ విసిరే ఎంగిలి రొట్టెల కోసం, వారు కల్పించే వేదికల మైలేజ్ కోసం వెంపర్లాడే దుస్థితికి దేశంలోని ప్రతిపక్షాలన్నీ దిగజారాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం తన ప్రధాన ప్రతిపక్ష పాత్రను అధికారికంగానే కాక్రోచ్ జనతా పార్టీకి రాసిచ్చేస్తే మంచిదేమో అన్న సెటైర్లు రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రజాక్షేత్రంలో ప్రజల నాడిని పట్టుకుని పోరాడే దమ్ము లేక, ప్రతీదానికీ ఈవీఎంలు, ఎన్నికల సంఘం అంటూ సాకులు వెతుక్కుంటూ కాలం గడిపే పార్టీలకు రాజకీయం చేయడం చేతకానట్లే.

మోడీ సర్కార్‌కు గుదిబండగా మారిన సీఈసీ జ్ఞానేశ్వర్..!



న్యూఢిల్లీ,ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినంత ఈజీ కాదు.. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ రాజీనామా చేయడం. అది క్లారిటీ. కాక్రోచ్ పార్టీ, జెన్‌జీ మూకుమ్మడిగా మొన్న జంతర్‌మంతర్ వేదికగా చేసిన పోరాటానికి మోడీ తలొగ్గాల్సి వచ్చింది. అందులో పెద్దగా రాజకీయ ప్రమేయం లేదు. ఈ పోరాటానికి యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చింది.పోలీసుల చర్యతో మరింత బద్నామైంది కేంద్రం. అందుకే వీటిన్నింటికీ తక్షణ పరిష్కారంగా ధర్మేంద్రను రాజీనామా చేయించడమేనని వెనక్కి తగ్గాడు మోడీ. దీన్ని పరాజయం అనుకోలేదు. నష్ట నివారణేనని అంగీకరించాడు. ఇప్పుడు పరిస్థితి దీనికి మించినది. తీవ్రత కలిగినది. ఏకంగా కేంద్ర ప్రభుత్వం తీరునే ప్రశ్నించేది.ఓటరు సవరణ జాబితా.. ఎస్ఐర్‌లో జ్ఞానేశ్వర్ అత్యుత్సాహం స్పష్టమైంది. కేంద్రం కనుసన్నల్లోనే ఇది జరిగిందనేది అందరికీ తెలిసిపోయింది. ఓ మరకైతే పడింది కేంద్ర సర్కార్‌పై. అది మామూలు ఆరోపణ కాదు. అసలు మోడీ ప్రధాని కావడంలోనే లోపం ఉందనేలా, బీజేపీ అధికారంలో ఉన్నదే మోసం చేసి అనేలా.. ఇది మరీ తీవ్రంగా మారి ఉంది.ఈ విషయంలో తోటి కమిషనర్ల అభ్యంతరాలు బయటకు రావడమే దీనికి జీవం పోసింది. అప్పటి దాకా కాంగ్రెస్ దీనిపై పోరాటాలు చేస్తున్నా.. పెద్దగా ఫలితం రాలేదు. జనం పెద్దగా పట్టించుకోలేదు. కాక్రోచ్ పార్టీ, జెన్‌జీ కూడా దీనిపై సరైన సమాచారం, ఆధారాలు లేక నిమ్మకుండిపోయాయి.కానీ ఇద్దరు కమిషనర్ల ఇష్యూ ఎప్పుడైతే బయటకు వచ్చిందో.. మంచి ఊతం దొరికింది జెన్‌జీకి. అందుకే జంతర్‌మంతర్ 2.0గా ఈ పోరాటానికి నామకరణం కూడా చేసుకున్నారు. ముంబై కేంద్రంగా గాంధీ జయంతి నాడు చేపట్టిన జెన్‌జీ ఉద్యమం... విజయవంతమైంది. ఎన్నికల సంఘంపై విశ్వసనీయత ఎలా పోయిందో.. కాక్రోచ్, జెన్‌జీల ఉద్యమంపై జనంలో విశ్వసనీయ పెరుగుతున్నది. మోడీ భయం కూడా ఇదే. అందుకే జెన్‌జీని ఆయన లైట్‌గా తీసుకోవడం లేదు.జ్ఞానేశ్ రాజీనామా చేయకపోతే ఈ నెల 10న జంతర్ మంతర్ చేరుకుంటామని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కాక్రోచ్ పార్టీ కన్వీనర్ అభిజిత్ దీప్కే ప్రకటించి ఉన్నాడు. ముంబయి శివాజీ పార్క్ వద్దకు పోలీసులు ఎన్ని నిర్బంధాలు విధించిన యువత చొచ్చుకొచ్చారు. త్వరలో చేపట్టే ఉద్యమంలో భాగంగా జంతర్ మంతర్ వద్దా అదే పరిస్థితి ఉంటుందని కేంద్రానికి తెలుసు.నీట్ పేపర్ లీకేజీ... ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఆందోళన విషయంలో కూడా కేంద్రం ఎన్ని నిర్బంధాలు విధించాలో, ఎన్ని ఆంక్షలు పెట్టాలో అన్నీ పెట్టింది. కానీ వారు వినలేదు. కేంద్రమే వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పుడు అంత ఈజీగా జ్ఞానేశ్ రాజీనామాకైతే కేంద్రం తలొగ్గదు.రాజీనామాకు ఒప్పుకుంటే తాము తప్పు చేశామని, తప్పులతడక ఓట్ల లిస్టుతోనే గెలిచామని ఒప్పుకున్నట్లవుతుంది. జ్ఞానేశ్‌ను వెనకేసుకొస్తే.. దొంగ దొరికినా.. బాహాటంగానే ఇక ఇలాగే ఎన్నికలకు పోయేందుకు సిద్ధమయ్యారనే సంకేతం ఇచ్చినట్లవుతుంది.రెండో ఆప్షన్‌లో .. దేశం కోసం, ధర్మం కోసం.. అనే ట్యాగ్‌లైన్ తమను కాపాడుతుందనే ధీమాతో బీజేపీ ముందుకు పోయే వ్యూహమే కనిపిస్తోంది. ఇప్పటికే మోడీపై ప్రజా వ్యతిరేకత పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో... జెన్‌జీ పోరాటాన్ని అణగదొక్కి, ఎన్నికల సంఘాన్ని వెనుకేసుకొచ్చి.. ప్రజల వద్ద మోడీ విశ్వసనీయతనే పరీక్షగా పెట్టి మెజారిటీ జనం నాడి ఎలా ఉందో తెలుసుకునే రిస్క్ మోడ్ లోకి మోడీ వెళ్లేందుకు రెడీ అయ్